క్లుప్తంగా

ఆలయ భూములు పరిరక్షించాలి

పామూరు: పామూరు, పరిసర ప్రాంతాల్లో అన్యాక్రాంతమైన ఆలయ భూములను పరిరక్షించి ఆలయానికి చెందేలా చూడాలని కోరుతూ గురువారం దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి బీజేపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కే.వి.రమణయ్య వినతిపత్రం అందజేశారు. కనిగిరిలో వివిధ కార్యక్రమాలు ముగించుకుని నెల్లూరు వెళ్తున్న మంత్రిని పామూరు సమీపంలోని 565 జాతీయ రహదారి సర్కిల్‌వద్ద పామూరు మండల నాయకులు కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేవీ రమణయ్య మాట్లాడుతూ పామూరులో మదనవేణుగోపాలస్వామి, వల్లీ భుజంగేశ్వరస్వామి, అభయ ఆంజనేయస్వామి, బ్రహ్మంగారి ఆలయాలకు రూ.కోట్లాది విలువైన పొలాలు ఉన్నాయన్నారు. వీటిలో నెల్లూరు రోడ్డులో కొందరు ఆక్రమించి ప్లాట్లు పెట్టి విక్రయించారన్నారు. బ్రహ్మంగారి మఠం ఆస్తులను లీజుకు ఇచ్చారని దీనిపై తక్షణ విచారణ చేయించి ఆలయ ఆస్తులను పరిరక్షించేలా చూడాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ


వాటర్ క్యాన్ అందజేస్తున్న సొసైటీ సభ్యులు

కందుకూరు రూరల్: కందుకూరులోని ప్రశాంతి నగర్, బృందావనం కాలనీల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ వారు కూలింగ్ క్యాన్స్, విద్యా సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుర్రం అల్లూరయ్య మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యా సామగ్రి అందించినట్లు పేర్కొన్నారు. ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు కూలింగ్ వాటర్ క్యాన్లు, విద్యా సామగ్రి అందజేయడం అభినందనీయమన్నారు. దాతలు అందజేసిన సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు, సేవారత్న రవ్వా శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ రవ్వా అరుణ, ఉపాధ్యాయురాలు ఇందిరా రాణి, స్వప్న, కోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భూసేకరణ ప్రకటన రద్దు చేయాలి

- జిల్లా రైతు సంఘం డిమాండ్


కరేడులో పర్యటిస్తున్న రైతు సంఘ నాయకులు

ఉలవపాడు: కరేడులో బలవంతపు భూసేకరణ ప్రకటనను రద్దు చేయాలని జిల్లా రైతు సంఘం డిమాండ్ చేసింది. గురువారం జిల్లా రైతు సంఘ నాయకులు కరేడు పంచాయతీ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతు సంఘం సీనియర్ నాయకులు చంద్రగోపాల్, జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య మాట్లాడుతూ కరేడులో మూడు పంటలు పండే పంటలు ఉన్నాయని, ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల తోటలు ఉన్న ఈ గ్రామాన్ని కార్పొరేటుకు కట్టబెట్టడం సరైంది కాదన్నారు. రైతులు, రైతు కూలీలు ఈ భూములనే నమ్ముకుని జీవిస్తున్నారన్నారు. గ్రామ సభను ప్రాతిపదికగా తీసుకుని రైతుల అభిప్రాయాలను గౌరవించి నోటిఫికేషన్ రద్దు చేయాలన్నారు. కర్ణాటక రాష్ట్రం పద్ధతిలో కరేడు ప్రజానీకం పెద్ద ఎత్తున పోరాటం చేస్తోందని, దానికి అండగా ఉండి విజయం సాధించే వరకు ఉంటామని ప్రకటించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శి గోపసాని రమేష్, రామకృష్ణాపురం నాయకులు రమణమ్మ, ధనలక్ష్మి, మిరియం శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ


తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కందుకూరు రూరల్:

కందుకూరులోని ఎరువుల దుకాణాలు, ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలపై విజిలెన్స్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. శ్రీలక్ష్మి సరస్వతి ఫర్టిలైజర్స్, శ్రీలక్ష్మి ఏజెన్సీ, న్యూ విజయ జానకి పార్శిల్ సర్వీస్‌ల్లో తనిఖీ చేశారు. వీటిల్లో శ్రీలక్ష్మి సరస్వతి ఫర్టిలైజర్స్, శ్రీలక్ష్మి ఏజెన్సీల్లో అనుమతి పత్రాలు లేని వివిధ రకాల పురుగుమందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వీటి విక్రయాలు నిలిపివేయాలని యాజమానులు ఆదేశించారు. వీటి విలువ రూ.32 లక్షలు ఉంటుంది. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు, వినుకొండ ఏడీఏ రవికుమార్, సీఐ రాఘవరావు, ఏడీఏ నరసోజి, కందుకూరు మండల వ్యవసాయాధికారి ఎస్కే అబ్దుల్ రహీం ఉన్నారు.

కానరాని చెత్తశుద్ధి

- అధికారుల మాటలకే పరిమితమైన చెత్త రహిత గ్రామాలు
- గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త
- కాలువల్లో కదలని మురుగు
- స్వచ్ఛాంధ్రప్రదేశ్ పేరుతో హడావుడి చేయడం తప్ప అమలులో విఫలం
- అధికారులు, సిబ్బంది పనితీరుపై తీవ్ర విమర్శలు


పాకల బీచ్ వద్ద చెత్త పేరుకుపోయిన దృశ్యం

సింగరాయకొండ: 'గ్రామ పంచాయతీలను చెత్త రహితంగా తీర్చిదిద్ది స్వర్ణాంధ్రప్రదేశ్– స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ లక్ష్యాన్ని నెరవేరుస్తాం'అంటూ పత్రికలకు ఫోజులివ్వడం తప్ప అధికారులు, సిబ్బంది చేస్తోంది శూన్యం. కార్యక్రమం ప్రారంభం రోజున ఘనంగా ర్యాలీలు చేయడం ప్రజలను మభ్యపెట్టి ఆ తర్వాత ఆ కార్యక్రమాన్ని గురించి పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో గ్రామాల్లో చెత్త పేరుకుపోతోంది.

మొదటి విడత కాదు..అదే చివరి విడత..

స్వర్ణాంధ్రప్రదేశ్– స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో మండలంలోని సింగరాయకొండ, మూలగుంటపాడు, పాకల, బింగినపల్లి, కలికవాయ గ్రామాలను చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. అయితే ఆచరణలో ఈ కార్యక్రమం ఆదిలోనే అటకెక్కింది. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటనలు ఇవ్వడమే గానీ ఆ తరువాత ఏం చేయాలి, ఎంత నిధులు ఇవ్వాలన్న దానిపై దృష్టి సారించలేదు.దీంతో గ్రామాల్లో చెత్త తీసుకుని వెళ్లే రిక్షాలు సక్రమంగా లేకపోవటం, పారిశుధ్య కార్మికులు పూర్తి స్థాయిలో పనులకు హాజరు కాకపోవటంతో ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పేరుకుపోతున్న చెత్త

మండలంలో చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని సింగరాయకొండ, మూలగుంటపాడు, పాకల, బింగినపల్లి గ్రామాలను ఎంపిక చేశారు. మొదట్లో డీఎల్‌పీఓ స్థాయి అధికారులు వచ్చి పర్యవేక్షణ చేశారు. తరువాత మండల, గ్రామస్థాయి అధికారులు ఎవ్వరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో గ్రామాల్లో రోడ్ల వెంట చెత్త దిబ్బలు దర్శనమిస్తున్నాయి.

దోమలపై దండయాత్ర చేస్తున్న ప్రజలు

గ్రామాల్లో కాలువల్లో మురుగు పేరుకుపోవటం, చెత్త కుప్పలు దర్శనమిస్తుండటంతో అవి దోమలకు ఆవాసాలుగా మారాయి. దీంతో ప్రతిరోజు ప్రజలు దోమలను అరికట్టే జెట్ కాయిల్స్, దోమల అగరవత్తులు, లిక్విడ్‌లతో దోమలపై దండయాత్ర చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. హనుమాన్ నగర్‌తో పాటు డ్రైవర్ పేట, బుంగబావి సెంటర్, భైరాగిమాన్యం, ఈదర్గమిట్ట, పాకల లోని పల్లెపాలెం, తదితర ప్రాంతాలు చెత్తతో పేరుకుపోవడంతో దోమల బెడద తీవ్రంగా ఉందని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. సింగరాయకొండ పంచాయతీ హనుమాన్ నగర్, మాగుంట సుబ్బరామిరెడ్డి కాలనీ, బుంగబావి సెంటర్ ప్రాంతాలలో రోడ్ల వెంట పిచ్చి మొక్కలు పేరుకుపోయాయి. దీంతో రాత్రిళ్లు ఈ ప్రాంతంలో తిరగాలంటే విషపురుగుల ప్రమాదం ఉండటంతో భయంగా ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగుపరిచి చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


పాకల పంచాయతీ క్రాంతినగర్ సమీపంలో చెత్త పోసిన దృశ్యం


బుంగబావి చెరువు వద్ద పేరుకుపోయిన చెత్త

పాలనలో కూటమి ప్రభుత్వం విఫలం


వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి సురేష్


క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ఆదిమూలపు సురేష్

కొండపి: ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ ధ్వజమెత్తారు. కొండపిలో పార్టీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ నూతన కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం పార్టీ విస్తృత స్థాయి సమావేశం బాబు షూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టేందుకు అలివిమాలిన హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదిలోఒక్క హామీ కూడా నెరవేర్చలేకపోయిందని మండిపడ్డారు. హామీలు అమలు చేయకుండా సూపర్ సిక్స్ గురించి ప్రశ్నిస్తే నాలుక కత్తిరిస్తామని సీఎం స్థాయిలో చంద్రబాబు చెప్పడం దుర్మార్గమన్నారు. అదిగో అమరావతి, ఇదిగో అమరావతి అంటూ పచ్చమీడియా గ్రాఫిక్స్‌లో మరోసారి మభ్యపెడుతుందని, కానీ పనులు చూస్తే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సామెతగా ఉందన్నారు. ప్రజలకు భయపడి మంత్రులు, ఎమ్మెల్యేలు బయటకు రావాలంటే జంకుతున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ హయాంలో జగనన్న అమ్మఒడి, రైతుభరోసా, మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఎన్నో సంక్షేమ పథకాలను బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారని, చంద్రబాబు ఒక్క పథకానికైనా బటన్ నొక్కి ప్రజలకు నగదు వేశారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయన్నారు.

నిందితులను పట్టుకోలేరా..?

పోలీస్, రెవెన్యూ వ్యవస్థలు పూర్తిగా ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ పాలన సాగిస్తున్నారన్నారు. పోలీసులైతే పసుపు చొక్కాలు వేసుకొని టీడీపీ కార్యకర్తల్లాగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి స్వామి అండదండలతో రెచ్చిపోతున్న పోలీసులు కూటమి ప్రభుత్వం శాశ్వతంగా అధికారంలో ఉండరన్న విషయం గుర్తించుకోవాలన్నారు. పంట చేతికి వచ్చిన దశలో పెట్లూరు చెందిన కల్లూరి చంద్రమౌళి బొప్పాయి పంటను దుండగులు నరికివేస్తే ఇప్పటికీ దుండగలను పట్టుకోలేని స్థితిలో పోలీస్ వ్యవస్థ ఉందని విమర్శించారు. జాళ్లపాలెం గ్రామంలో పోలీసులు దగ్గర ఉండి వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల రచ్చబండను ధ్వంసం చేయించారని, పెద్దకండ్లగుంట సర్పంచ్ భువనగిరి సత్యనారాయణ ఇంటి ప్రహరీని ధ్వంసం చేశారని ఇలాంటి అరాచక పాలనకు పోలీసులు సైతం మద్దతు ఇవ్వడం దుర్మార్గమన్నారు. 2029లో కొండపిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం తథ్యమన్నారు.

నియోజకవర్గంలో కీలక నాయకుడు ఇసుక, మద్యం మాఫియాను విచ్చలవిడిగా ప్రోత్సహిస్తూ జేబులు నింపుకుంటున్నారన్నారు. బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం మండల స్థాయిలో పూర్తయిన తర్వాత గ్రామస్థాయిలో ప్రతి ఒక్క నాయకుడు సమన్వయంతో పూర్తిచేసి బాబు మోసాలను ఎండగట్టాలన్నారు. అనంతరం నాయకులతో కలిసి బాబు షూరిటీ మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దాకా పిచ్చిరెడ్డి, మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరావు, వైస్ ఎంపీపీలు కోటరాజు, ప్రసాద్, మురళి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వసంతరావు, వన్నూరు రమణారెడ్డి, రవీంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామయ్య, సుబ్బు నారాయణ సుబ్బయ్య, శ్రీను, సుల్తాన్, కొర్నేలు, నారాయణ, నజీరు చిన్న వసంతరావు, శేఖర్‌రెడ్డి, హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై ప్రజాప్రతినిధుల ధ్వజం


ఎంఈఓను ప్రశ్నిస్తున్న ఎంపీపీ గాయం సావిత్రి

హనుమంతునిపాడు: అధికారుల పనితీరుపై మండల ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఎంపీటీసీ కొదమల బెంజిమెన్ మాట్లాడుతూ లింగంగుండ్ల గ్రామానికి నెలలో రెండుసార్లు మాత్రమే సాగర్ జలాలు సరఫరా అవుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్‌ను నిలదీశారు. ఏహ్సా కాలనీలోని పాఠశాలల్లో 3,4,5 తరగతుల విద్యార్థులను దూరంగా ఉన్న పాఠశాలల్లో తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండానే ఎలా కలిపారని ఎంపీపీ ఎంఈఓ పెద్దిరాజు ప్రశ్నించారు. అక్కడి పిల్లలు అక్కడే ఉండేటట్లు చూడాలన్నారు. పైపులు మరమ్మతులు చేసి ప్రజలకు తాగు నీరు వెంటనే సరఫరా చేయాలని కోరారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు మార్చాలని హాజీపురం సర్పంచ్ తిరుపతిరెడ్డి ఏఈని కోరారు. జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పని కల్పించాలని సభ్యులు కోరారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చి అధికారులు బాధ్యతాయుతంగా ప్రవర్తించడం లేదని తెలిపారు.

ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ ఎక్కడ?

మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించేటప్పుడ, ప్రభుత్వ కార్యక్రమాల సమయంలో గ్రామ సర్పంచ్‌కు తెలియజేయాలని, ప్రోటోకాల్ పాటించాలని ఎంపీపీ గాయం సావిత్రి అన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేయాలన్నారు. ఉపాధి పనులకు వెళ్లకుండా విజయవాడ, గుంటూరు, ఒంగోలు ఇతర ప్రాంతాల్లో ఉండే వారికి హాజరు వేసి బిల్లులు తీసుకుంటున్నారని, ఇది మంచి పద్ధతి కాదని, దీనిపై విచారణ చేయాలన్నారు. తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులకు సమావేశం లేకుండా ఏ విధంగా సమావేశాలు నిర్వహిస్తారని ప్రశ్నించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించారు. తహసీల్దార్ షేక్ నాగూర్‌మీరా, ఎంపీడీఓ ఎం రంగసుబ్బరాయుడు, ఏఓ రవికుమార్, ఏఈ శ్రీకాంత్, పీఆర్ ఏఈ బ్రహ్మయ్య, డాక్టర్ లక్ష్మీ భార్గవి, పశువైద్యులు, ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

శ్యామ్ మరణం బాధాకరం


శ్యామ్ మాదిగ మృతదేహానికి నివాళులర్పిస్తున్న బుర్రా

కందుకూరు: సామాజిక న్యాయ ఉద్యమకారుడు, ఎమ్మార్పీఎస్ నాయకుడు సూరపోగు శ్యామ్ మాదిగ అకాల మృతి బాధాకరమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. పట్టణంలోని ఆదిఆంధ్ర కాలనీకి చెందిన శ్యామ్ మాదిగ (55) అనారోగ్య కారణాలతో బుధవారం మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి బుర్రా నివాళులర్పించారు. శ్యామ్ మాదిగ మృతి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ రఫీ, గణేశం గంగిరెడ్డి, ముప్పవరపు కిశోర్, నాగభూషణం, రేణమాల అయ్యన్న, ఉచ్చులూరి రవీంద్ర, కానాల ప్రసాద్, షేక్ బికారి, రేణమాల మహేశ్వరరావు, సూరపోగు రాజశేఖర్ పాల్గొన్నారు.

మోకాళ్లపై కార్మికుల నిరసన


మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

కనిగిరిరూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు మోకాళ్లపై కూర్చొని గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు పీసీ కేశవరావు మాట్లాడుతూ ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారంలో తీవ్రంగా విఫలం చెందిందన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని, మున్సిపాలిటీలో జనాభాకు తగ్గట్టు కార్మికులను నియమించాలని, సంక్రాంతి కానుకలు, పనిముట్లు, దుస్తులు అందచేయాలని, చనిపోయిన కుటుంబాలకు ఉపాధి కల్పించాలని, పీఎఫ్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కార్మికులు సమ్మె చేశారు. మున్సిపల్ యూనియన్, సీఐటీయూ నాయకులు చార్లెస్, లక్ష్మయ్య, ప్రసాద్, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు నష్టం



మాట్లాడుతున్న బుర్రా మధుసూదన్ యాదవ్

- వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బుర్రా

కందుకూరు (వలేటివారిపాలెం): కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు నష్టం జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. మండల కేంద్రం వలేటివారిపాలెంలో గురువారం జరిగిన బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో విస్తృతంగా నిర్వహించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ఏ విధంగా నష్టపోతున్నారో ప్రజలకు వివరించాలన్నారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై ఇష్టారీతిన కేసులు పెడుతోందని, అక్రమ కేసులను ధైర్యంగా ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. సూపర్‌సిక్స్ అంటూ అందరితో ఓట్లు వేయించుకున్న తర్వాత ప్రజలను మోసం చేయడం తగదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లినప్పుడే పార్టీ బలం పెరుగుతుందన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు అనుమోలు లక్ష్మీనరశింహం పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తత అవసరం


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

పామూరు: డెంగీపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ రవళిప్రియాంక అన్నారు. డెంగీ జాతీయ మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక కేజీబీవీలో విద్యార్థులకు మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవళి ప్రియాంక మాట్లాడుతూ ఇంటిలోపల, పరిసరాల్లో మురికినీటి నిల్వలు అధికంగా ఉన్నచోట అవి పెరుగుతాయన్నారు. డెంగీ లక్షణాలు ముఖ్యంగా కండరాల నొప్పులు, తీవ్రమైన జ్వరం, చర్మంపై ఎర్రటి దద్దుర్లు, వికారం, వాంతుల మొదలైన లక్షణాలు ఉంటాయని, రక్తపరీక్ష ద్వారా నిర్ధారించుకోవచ్చన్నారు. జాగ్రత్తలు, డాక్టర్ల సలహాలు సూచనలు పాటిస్తూ మందులు వాడితే త్వరితగతిన బయటపడవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో నీటినిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇళ్లలో ఫ్రిజ్‌లో నిల్వనీరు, టైర్లల్లో, ఖాళీగా పడేసిన బాటిళ్లలో, ఉపయోగించని తొట్లలో నీరు నిల్వలేకుండా చూసుకోవడం ద్వారా ఈ దోమల పెరుగుదలను నియంత్రించవచ్చన్నారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ కటకం సజన, హెచ్‌ఈఓ బ్రహ్మానందం, ఆరోగ్య కార్యకర్త సుబ్రహ్మణ్యం, ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, డీపీఎంఓ ప్రసాదరెడ్డి, ఆశాకార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

385 పొగాకు బేళ్లు తిరస్కరణ


కొండపిలో వేలం నిర్వహిస్తున్న అధికారులు


టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

కొండపి: స్థానిక వేలం కేంద్రం పరిధిలో గురువారం నిర్వహించిన వేలంలో 385 పొగాకు బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. రోజురోజు ధరలు లేక బేళ్లు తిరస్కరణకు గురవుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే ధరలు లేక నానా ఇబ్బందుకు పడుతుంటే మరో పక్క ధరలు లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. బేళ్లను తిరస్కరించకుండా ఎంతో కొంతకు కొనుగోలుచేయాలని, తమ గోడును బోర్డు అధికారులు, కంపెనీ బయ్యర్లకు వేడుకున్నా ఫలితం లేదంటున్నారు. గురువారం పెద్ద కండ్లగుంట, అయ్యప్ప రాజుపాలెం, నరసరాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1095 బేళ్లను వేలానికి తీసుకురాగా 710 బేళ్లు కొనుగోలు చేసి వివిధ కారణాలతో 385 తిరస్కరించారు. గరిష్ట ధర రూ. 280, కనిష్ట ధర రూ.160 పలకగా, సరాసరి రూ. 226.58గా నమోదైంది. వేలంలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్ తెలిపారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో గురువారం జరిగిన వేలంలో 912 పొగాకు బేళ్లు కొనుగోలు చేశారు. ఆలకూరపాడు, రావివారిపాలెం, పాలేటిపాడు, జయవరం, అనంతవరం గ్రామాలకు చెందిన రైతులు 1054 బేళ్లను తీసుకురాగా 913 కొనుగోలు చేసి 141 పొగాకు బేళ్లు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.211.54గా నమోదైంది. వేలంలో 25 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ఆరాధన మహోత్సవాలు ప్రారంభం


నారాయణస్వామివారి మూల విగ్రహమూర్తి


పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు కదిరి పార్థసారథి, నాయకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆరాధన మహోత్సవం గురువారం ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు పర్యవేక్షణలో వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రుత్వికులు మంకాల శివప్రసాద్, రావినూతల రమేష్, జొన్నాబొట్ల తేజలు నారాయణస్వామి మూల విగ్రహమూర్తికి అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పుణ్యాహవచనం, కలశస్థాపన, మహానారాయణహోమం, నవగ్రహ హోమాలు, పంచహారతులు నిర్వహించారు. పూజల్లో వైఎస్సార్ సీపీ నాయకులు కదిరి పార్థసారథి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి పలువురు నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆరాధన మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గుంటుపల్లి సుబ్బరాయుడు, అరుణ, కొమ్మినేని సరోజమ్మ, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కందుకూరు డివిజన్
90102 24456
Office mail : sakshiongads@gmail.com